పెద్దమ్మి "వెఱ్ఱి నా కుఱ్ఱడు! రిక్షా లాగుడు వదల్లేదు!" అంటూ వెనక్కు నడచివచ్చి ఆ నెత్తు(రాయిని పైకెత్తి చూస్తూ "రాయీ! నెత్తురూ! దాన్ని తలపోసికొనే యన్నాడు కమోసు "రోజాపువ్వులు!" అని నా బాబు, యంటూ గిలగిల్లాడింది లోలో గిలగిల్లాడింది.

ఆలా పెద్దమ్మి గిలగిల్లాడుతూనే వుంది: బళ్ళున తెల్లాఱింది—

....

జా లా రి వీ రు డు

"వాళ్ళూ మనుష్యులే మనమూ మనుష్యులమే యని తోచినప్పుడు గాని మనుష్య లన్యోన్యం హింసించుకోవడం మాన" రని నా సిద్ధాంతం. ఇది పైకి చాలా సులభమైన సిద్ధాంతం, అందఱూ యనుకునే సిద్ధాంతం క్రిందే కనబడొచ్చుగాక. ఒక్కొక్క మానిసియొక్క యనుభవంలోకి వచ్చేసరి కొక్కొక్కప్పుడు ఆ మానిసి జీవితంకూడా యంతానికి రావచ్చును. అంటే చాలా కాలం పట్టునన్నమాట. ఎలాగు యంతకాలం పడుతుందో లోకానికి బోధపడేందుకు ఇక్కడ నేనీకథలో ఒక జాలారివాని యొక్క ప్రత్యక్షానుభవాన్ని గురించి వ్రాయదలచుకొన్నాను. పాఠకులంతా బహూశ్రద్ధాభక్తులతో చదివి యందలి పరమార్థం గ్రహించాలనికూడా నేనభిలషిస్తూవున్నాను.

పెద్దవాల్తేరువద్ద చిన్నకుప్పం జాలారిపాలెం నాఁబడే దొకటుంది. చాలామంది దాన్ని చూచివుండరు. "లాసెన్సుబే"కి

అది రేవుస్థానం. ఎత్తుగా రోడ్డుయుంటే ఆరోడ్డు దిగువాయిని ఏటవాలు వంకరటింకర్లతో ఒక వాన్నీటిజాలు కోసి ఏర్పఱచిన ఇసకా రాయీ చాలుంటే, ఆ చాలే వీధిగా జూచుకొని దానికిటూ నటూ, వెలుతురూ గాలీ పోని చుట్టుగుడిసెలు, గుడిసెమీద గుడిసెగా కట్టుకొని, పడుకోవాలంటే ఎక్కడంటూ, నడ్డెత్తుకు నిలువుగా నడవాలీ యంటే ఏలాగనుకుంటూ, కూడొండుకునే పొయ్యివెల్గు కూడు తినే కంచుగిన్నెమీద తప్ప మఱోతేజస్సన్నదనే పదార్థమ్మీద పడనంతటి, ఇఱుకాటంగా మఱకాళ్లో అరవై డెబ్భై గడప,—వాళ్ళూ మనుష్యులేనా అన్నట్టుట్లాడుతూంటే—, లోకాని కెఱుకపడుతూ ఉంటుంది. ఆ చిన్నస్థళం.

పురుషులు పడవలు కట్టుకు చేపలవేటకు సముద్రమ్మీదకు పోయి తిరిగి వచ్చేటప్పటికి ఆడవాళ్లు బుట్టలతో తట్టలతో ఒడ్డు నుండి ఏంపడ్డాయో యని ఆసాసతో, ఆకాంక్షతో యవలోకిస్తూ యుంటే, దగ్గఱనున్న కొండలూ కొండలమీదకు తెరలి తెరలి దొరలిపడే కరళ్ళూ, కరళ్ళచాయనే ఎగిరే పక్షులు, అన్నికూడా ఎందుకనిపిస్తాయి వాళ్లకళ్ళముందు: అంత ఆబ ఆ కళ్ళల్లో యవ లోడనంగా యగపిస్తుంది. కొమ్మకోనాలు, నల్లజల్లల జంజరాలు తాంబేళ్ళు, అదివఱకెప్పుడూ చూడని రకరకాలవీ తరతరాలవీ పురుషులు తెచ్చి పడేసేతలికి, వాళ్ళయొక్క ఆడవాళ్ళకీ పిల్లలకీ ఒళ్ళు తెలియనంతటి ఆనందం ఎక్కడినుంచి వచ్చి పడుతుందో వచ్చిపడుతుంది. దొంగచాటుగా లాగేవికొన్ని, దొరతనంగా తీసుకునేవికొన్ని, ఎఱుకపఱచి ఎగరేస్కుపోయేవి కొన్ని, ఇలా యన్నీ తుదకు ఎవళ్ళపరమో ఒకళ్ళపరమైపోతాయి. ఆ పట్టుకు వచ్చిన పురుషుడు తనకోసం మిగిలించుకునేది తన

వలాతన శరీరం యంతే! వేటపడవకూడా ఒక్కొక్కప్పుడు చెక్కలు చెక్కలు ముక్కలు ముక్కలు అయిపోతుంది కొండ తగిలీ తిమింగలం తోకదెబ్బ తినీ.—

వాణ్ణి—ఆ జాలారివాణ్ణి—చూస్తే వాడికి మనుష్యులతో సంబంధమనేది వున్నదా వానికి సముద్రం తప్ప వేటేలోకం వేటేగొడవ వేటేబాదరబందీ కలదా యని యనిపిస్తుంది. ఏఇతర మనుష్యుడూ వాని బాగుకోసం, వాని శుభ్రతకోసం యోజించే డట్టే కనబడడు. గవర్నరుగారు చూస్తే చిన్నవాత్తేరులోని విశ్వవిద్యాలయ భవనాలు విశాఖపట్నంలోని హార్బరు చూచి పోతారు గాని జాలరిపాలెం చూస్తారా? అయినా ఆపల్లెవా డెప్పుడూ తనకో ఇంటర్వ్యూ కావాలని గవర్నరుగారి కార్య దర్శినికాని కలక్టరుగారిని గాని యడిగేడా ఏమిటి? అడిగినా దొరకదు. ఆజాలారిపాలెంయొక్క పౌరసత్వాలను గుఱించి, దాని యొక్క ఆరోగ్యమును గుఱించి, దానియొక్క ఆర్థికానర్థాలని గుఱించి యోజించే ప్రభువు మఱియొకడు! ఈ భూమిమీది ప్రభువు గాడు! అందుచేతనే మనకు ఏమనిపిస్తుందీ? జాలారివాణ్ణి చూస్తే ఏమనిపిస్తుంది? వాడికి మనుష్యులతో సంబంధం అనేది యున్నదా? వానికి మహాసముద్రంతప్ప వేటేలోకం వేటేగొడవ వేటేబాదరబందీ ఉన్నదా అని అనిపిస్తుంది.

ఓయీ! నాగరికతలో పుట్టి పెరిగిన మనుష్యుడను నేను యని విఱ్ఱవీగే మానవుడా! వాణ్ణిగురించి దీర్ఘాలోచన చేయ వోయి! దీర్ఘాలోచన చేయవోయి! వానిలో నీకో దివ్యత్వము, వానినోట నీకో దివ్యసందేశము ప్రకటితం కాగలవేమో? దీర్ఘా లోచన చేయవోయి! దీర్ఘాలోచన చేయవోయి! వానిజీవితం చదవవోయి!—

జాలారి వీరుడు తన వేటపడవెక్కి బయలుదేరే డొక రేత్రిపూట. ఆ రేత్రి యతివిచిత్రమైన రేత్రి ! బయలుదేటి నప్పుడేమన్నా చుక్కలు బాగానే వెలుగుతున్నాయి, నభోమండ లాన్ని గాలి ఏమన్నా బాగానే వస్తూవుంది అరారగా, చల్లచల్లగా. హోరు విశేషంలేకుండా, సముద్రంకూడా చక్కగా శాంతిల్లే ఉంది. కాని బయలుదేటి పదిబారలు - సముద్రమ్మేర చెప్పే టప్పుడు పదిబారలంటే పదిమైళ్ళ-పదిమైళ్ళ గడిచేసరికి గరిఎెట్టి దేవితే యడుగుతెట్టు పైకివచ్చి కలిగిపోతుంది ఆలాగ్గా యల్ల కల్లోలంగా కనిపించింది సముద్రం. అయినా చొఱవచేసి యింకా పోసాగేడు జాలారివీరుడు అప్పటికప్పుడే నలుదెసలా గాలి, మోటాడు మూజూచినట్లు మొగమ్మీదికి వీపుమీదికి కణతల మీదికి కాళ్ళమీదికికూడా తగలడం ప్రారంభించింది, గాలిని కూడా లక్ష్యంచేయకుండా ఇంకా పోతున్నాడు జాలారివీరుడు. అంతరాళాన్ని మేఘాలు రయిగప్పి బోకురుబోకురు మంటూ కొట్లకుక్కలు దంష్ట్రాలు చూపించినట్లు మెఱుపులు చూపించ మొదలెట్టాయి. అప్పటికి జడియకుండా ఇంకా పోతూనే ఉన్నాడు జాలారివీరుడు. ఇఖ వానందుకొందీ అక్కడ ! చూడండి బాబూ ! వద్దూవద్దూ అన్నకొద్దీ మొత్తీమొత్తీ, విడిచిపెట్టందే ! తెల్లవార్లూ చాకిరేవుబల్లనేసి మొత్తినట్టు, తడపనూ మొత్తనూ, తడపనూ మొత్తనూ, తడపనూ మొత్తనూ ! జాలారివీరుడు పూర్తిగా జోలపోయి సొమ్ముసిల్లి తనగతి తానెఱుక్కుండా తానోలంకమీదికి తన పడవోలంకమీదికి వేఱుపడిపోయి, ఏడు కొండల వెంకటేశ్వరుడికి మొక్కులిడుకుంటూ కూకున్నాడు. అంత తుపాను పట్టినా జాలారివీరుని చేతిలో వల చేతిలోనే

ఉంది. ఎన్నడూ అటువంటి ఘోరమైన ఆపత్తు సముద్రమీమ్మీద తనకు తటస్థించి యెరుగడు. పాపం! ఏకాకి అయిపోయినాడు.

ఆ మాదిరిగా రెండుపగళ్ళూ రెండురాత్రుళ్ళూ, నిస్సహాయంగా, ఏమీ తోచక, ఏమీ నేరక, పరుండవలసి వచ్చింది. ఆకలేసిపోతూవుంది. తాగడానికి నీళ్లు ఆ నీళ్లుప్పగా ఉంటాయి. పోనీ తిందామంటే చేపా చిక్కదు, పీతా పెగల్దు. అదేదో భగవంతుని మహామాయగా ఎంచుకోవడంలో పడ్డాడు.

మూడోరోజు ఉదయంలాగుంది. ఆకలి దహించుకుపోతూంది. దాహం అమితంగా అవుతూంది. కోదండరామా! గాలివాన మళ్ళీ పడితేనే మేలంటూ మొత్తుకొంటూ వల ఒక్కమాటు విసరేడు.

ఆశ్చర్యం! పేద్దది పడింది. "ఎంతచేప్పడిందో" అని జాయిగా ఒడ్డుకు లాక్కుని దాన్ని ఇటూ అటూ దొర్లించి చూచేడు. దాని ఆకారం చేపగా ఉంటూ ఆ చేపాకారంలో మళ్ళీ మనుష్యాకారంగా మనుష్యుల్లోనూ మగవాని ఆకారంగా ఉంటూ, చంపేసి తినేదాం దాన్ని వెంటనే పచ్చిపచ్చిగానే అని—అనుకొన్న జాలారి వాణ్ణి—అల్లా ఆపేసేసింది. ఆ దారుణ కృత్యం చేయకుండా అరికట్టేసింది. మాట్లాడదు, కదులుతుంది. చేతులున్నాయి, చేతులుకి వేళ్ళున్నాయి, ముక్కుంది, తెక్కగూళ్లూ పక్కెముకలూ టిక్కుటిక్కుమంటున్నాయి. మొలమగమనిషి అంగమొలగా అగపిస్తూవుంది. ఎప్పుడవితే తనవల్లోపడ్డ చేపకు అలా మానవత్వం ఉండడం జాలరివీరుడు చూచేడో అప్పుడు తనకాకలి అవుతూవున్నాగానీ ఆ ప్రాణిని ఏమీచేయకుండా యధాప్రకారంగా తిరిగి నీటిలోకి విడిచి పుచ్చేడు.

ఆహా! వానిదయ! వానిజాలి! వాని సౌభ్రాతృ భావము! ఒకమూల వానికడుపు నుసి అయిపోతూవుంది. వాడు తింటే వద్దనేదికాదు అవతలవ్యక్తి. అయినాకానీ దానిజోలికి పోయినాడు కాడు. పోకుండా దాన్ని విడిచిపెట్టి, తనపొట్ట వెన్నెముక నంటుకుపోతూ ఉన్నకారణంకొద్దీ మళ్ళీ వల వేశాడు.

ఆ పర్యాయం ఆ మగవాడు మఱో ఆడదానితోకూడా ఈడూజోడుగా ప్రకాశిస్తూ జాలారివీరుని వల్లోపడ్డాడు. జాలారి వీరునికి ఆశ్చర్యం అంతకంటే అంతకంటే ఎక్కువ అవుతూ వుంది. ఆశ్చర్యంతోపాటు క్షుద్బాధా ఎక్కువ అవుతూనేవుంది. అయితేనేమి ? ఆ ఆడరూపంకూడా మనుష్య స్త్రీ ఆకారంగానూ ఉంది. చేపరూపంగానూ ఉంది. వక్షోజాలు, మర్మస్థానం, చంకలు గజ్జలు యవన్నీ మర్త్యభామిని కున్నట్టే. కాని చేపాకారం ! తదితరాలు !

మొదటితూరి మగమనిషిరూపంగా ఉన్న చేపను విడిచి పెట్టి భరింపరాని ఆకలికి లోనయి యుండడంచేత మలితూరి వల్లో రెండుస్వరూపాలు పడ్డప్పు డెలాగో వోలాగు రెండో స్వరూపాన్ని కబళించకుండా యుంటాడా జాలారివీరుడు ? నిజంగా ఆ ఆడస్వరూపాన్ని కాజేదామని గాఢంగా ఉవ్విళ్లూరి దగ్గఱకు వెళ్ళి చూచి ఇటూ అటూ మెదిలించేడు. ఆడదాన్ని కదిపితే మగది ఆడదానికి మఱింత దగ్గఱగా వచ్చింది. తమర్ని కలిపి తినేసి ఆకలి తీర్చుకోవోయి జాలారివీరుడా ! అన్నట్టూ తాము రతి గూడుతూ వున్నట్టుకూడా ఉండిపోయినయి. జాలారి వీరునియెడల, వానిలో నొకదానికీ తిరుగుమాట లేదు. తిరుగు

బాటు లేదు. కాని జాలారివీరుడు ఆ రెండింటి యొక్క కలయిక లోనూ మానవ దాంపత్యధర్మం తిలకించినవాడై అంత ఆకలితో నున్నవాడున్నూ ముగ్ధుడైపోయి చాచిన చేయి వెనక్కుతీసికొని మళ్ళీ రెండింటినీ సముద్రంలోనికి వదిలేశాడు.

అహా! వాని ఔదార్యము! వాని సద్భావము! వాని సాధువిచింతనము! ఆలా అని చెప్పి వాని కాకలి చల్లారిందా? దాహం కట్టిందా? లేదు. ఆకలి ఆరాటం అతిదుర్భరమైపోతూంది. కాలం గడచిన కొద్దీ కడుపులోని పేగులు గురగురలాడుతున్నాయి. కళ్లు గుంటలడిపోవటమేకాకుండా తలతిరుగుడు ఆరంభింపజొచ్చింది. ఇఖ మఱి పరోపకారం పనికిరాదనీ అయినా అసలైన పరిగె పడకూడదా మూడవసారి అనీ మూడవ సారి వలకంగొదిలేడు.

ఆ మాటు అదివఱకు పడ్డ దంపతులేకాకుండా, పిలపిల మంటూ కొన్ని పిల్లలు పడ్డాయి. కొన్ని పిల్లలుపడ్డాయి అనే కన్న కొందఱు పిల్లలు పడ్డారు అంటే నిజమేమో? ఏమా అంటే ఆ జీవాలుకూడా మనుష్యుల పిల్లలకు మల్లేనే చిబుకం చేతులూ అన్నీ వుండి చేపాకారాలుకూడా కలిగి వెలిసేయి. పిల్లరూపం గదా పోనీ భక్షించేసి ఆకలి తీర్చుకోకూడదూ జాలారివీరుడు? మనిషిరూపంగా వున్న భాగం విడిచిపెట్టి చేపరూపంగావున్న భాగం తినకూడదూ? తినలేదు! తినలేదు! తినలేదుసరిగదా ఆ మనిషి పిల్లల ఆకారంలో వున్నచేపల్ని ముద్దెట్టుకుని " నా బిడ్డలారా! మీరు నావల్లో పడ్డారుగాని నేను మీలోని మనుష్యత్వం గ్రహించి తినలేకుండా వున్నాను. నా పసిపాప లారా! మిమ్మల్నీ మీ తలిదండ్రుల్నీ విడిచిపెట్టుచున్నాను.

నేను చనిపోవుచున్నాను. నేను చనిపోవుచున్నాను. ఏకాకిగా నేను ఈ లంకమీద చనిపోవుచున్నాను. నేను మిమ్మల్ని తిని మనదలపను. నేను మిమ్మల్ని తిని మనదలపను. అని ఆగుంపు గుంపును సముద్రములోనికి చొఱవిడిచినాడు. తాను సన్యసించిన సమాధిని శరీరం చాలించినట్లు ముక్తి చూఱకొన్నాడు. దేవతలు ఆ జాలారివీరునిమీద పూలవాన కురియించేరు.

ఎందుక్కురియించేరు అంటే ఏమిచెప్పను ! దేవతలు ఆ జాలారివీరునిమీద పూలవాన గురియించేరు.

మర్నాడు మహాసముద్రం ఆ పువ్వుల్ని ఒడ్డుకు తీసుకొచ్చి చూపించక, నురువే చూపించి ఊరుకుందీ అంటే అది మహాసముద్రంయొక్క లోపంగాని దేవతలయొక్క లోపం గాదు. దేవతలు ఆ జాలారివీరునిమీద తెల్లని పూలవాన గురియించేరు.

“ తోడిమానవు డన్నంత, లోకం నిర్మింపవలసిన కరుణా సోపానాలకు పునాదిరాయి నాఁడు ఆ జాలారివీరుఁడు ఆ మహాసముద్రంలో దింపినాఁడు ! ” అని కామోసు దేవతలు ఆ జాలారివీరునిమీద బహూపరిమళించే విరులు అవిరళంగా గురియించేరు ! అవిరళంగా గురియించేరు ! కురియించేరు !

....

ముష్టి ముండా ?

ఆ గుడియొక్క యుత్తరంవైపు ద్వారమే యెప్పుడూ తెఱచియుండి భక్తులకు దారి జూపిస్తూవుంటుంది. పడమటివైపు ద్వారం సంవత్సరంలో మున్నూట అరవయ్యైదు రోజులూ